నేడు అలకాపూర్‌వాసుల శాంతి ర్యాలీ

మణికొండ: చెరువుల నుంచి వస్తున్న దుర్గంధం... పెరిగిన గుర్రపు డెక్కతో దోమల వ్యాప్తితో నిత్యం ప్రజలు పడుతున్న ఇబ్బందిని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు గ్రేటర్‌ అలకాపూర్‌ రెసిడెన్సీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ (గర్వ) అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం టౌన్‌ షిప్‌లోని రోడ్డు నెంబర్‌ 13 గణేష్‌ చౌక్‌ నుంచి నెక్నాంపూర్‌ చెరువు వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సహకరించాలని ఆయన కోరారు.

28న భూభారతి చట్టంపై అవగాహన

శంషాబాద్‌ రూరల్‌: భూ భారతి చట్టంపై శంషాబాద్‌ మండల పరిధిలోని రైతులకు ఈ నెల 28వ తేదీన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారులు తెలిపారు. కవేలిగూడ చౌరస్తాలోని ఎంఎం గార్డెన్‌లో సాయంత్రం 4 గంటలకు అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. భూమిపై హక్కులు, రిజిస్ట్రేషన్‌ సేవలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్‌



బండ్లగూడ ప్రధాన రహదారిపై పార్క్‌ చేసిన వాహనాలు

బండ్లగూడ: ప్రధాన రహదారులపై వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్‌ చేస్తున్నారు. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ టిప్పుఖాన్‌ బ్రిడ్జి నుంచి అప్పా చౌరస్తాకు వెళ్లే దారుపై ద్విచక్ర వాహనాలతో పాటు కార్లను పార్కింగ్‌ చేస్తున్నారు. దీంతో ఈ దారి గూండా వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ట్రాఫిక్‌ సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రధాన రహదారుపై ఉన్న దుకాణాలకు వచ్చే వారు రోడ్డుపై వాహనాలను పార్కింగ్‌ చేసి షాపింగ్‌లకు వెళ్తున్నారు. గంటల తరబడి ఈ వాహనాలు అక్కడే ఉంటున్నాయి. అక్రమ పార్కింగ్‌లకు పాల్పడే వారిపై ట్రాఫిక్‌ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన రహదారులపై అక్రమ పార్కింగ్‌లు లేకుండా చూడాలని వాహనాదారులు కోరుతున్నారు.

క్రమశిక్షణతోనే ఉత్తమ ఫలితాలు

గోల్కొండ: క్రమ శిక్షణతో చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చునని గోల్కొండ బీజేఆర్‌ ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ జి.మాధవి అన్నారు. ఇంటర్‌ ఫలితాల్లో కళాశాల టాపర్స్‌ను శుక్రవారం ఆమె ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ... ఇంటర్‌ మొదటి, ద్వితీయ సంవత్సరంలో మంచి ఫలితాలు వచ్చాయని, మంచి మార్కులు స్కోర్‌ చేసి విద్యార్థినులు తమ కళాశాలకే గర్వకారణంగా నిలిచారన్నారు. అత్యుత్తమ ఫలితాల వెనుక అధ్యాపకుల పాత్ర ఎంతగానో ఉందన్నారు. నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థినులే తమ కళాశాలలో ఎక్కువగా ఉన్నారని, భవిష్యత్తులోనూ అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ఎంపీసీలో ఇంటర్‌ సెకండ్‌ ఇయర్‌ విద్యార్థిని నస్రా ఫాతిమా(976), సాధియాబేగం(969) మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్‌ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: విద్యార్థులు సమ్మర్‌ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని పీస్‌ ఫోర్స్‌ సోసైటీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌ మహ్మద్‌ నజీబ్‌ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో 10వ తరగతి, ఇంటర్‌ పరీక్షలు రాసిన విద్యార్థులతో మాట్లాడారు. ఎన్‌జీవోలు, ప్రైవేటు వ్యక్తులతో పాటు పలు సొసైటీలు విద్యార్థులకు ఉపయోగకరమైన కోర్సులను సమ్మర్‌ క్యాంపుల్లో అందిస్తున్నాయన్నారు. కంప్యూటర్‌, ల్యాబ్‌టెక్నిషియన్‌, స్పోకెన్‌ ఇంగ్లీష్‌, మెథమెటిక్స్‌ తదితర అంశాల్లో సమ్మర్‌ క్యాంప్‌లు నిర్వహిస్తున్నారన్నారు. తమకు అభిరుచి గల సమ్మర్‌ క్యాంపుల కోర్సులలో చేరి సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్‌, ఇతర వృత్తి విద్యాకోర్సులకు వెళ్లే వారి కోసం ఇలాంటి సమ్మర్‌ క్యాంపులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మహ్మద్‌ ఫహాద్‌, అయూబ్‌, బాబర్‌ పాల్గొన్నారు.

క్రీడా మైదానం.. అలంకారప్రాయం...

నిరుపయోగంగా క్రీడా మైదానాలు

- నిర్వహణను గాలికొదిలిన అధికారులు
- క్రీడాకారుల్లో తీవ్ర అసంతృప్తి
- వసతులు కల్పించాలని డిమాండ్‌

శంషాబాద్‌ రూరల్‌: తుప్పు పట్టిపోతోన్న క్రీడా సామగ్రి.. మైదానంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు.. ఊరికి దూరంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి.. క్రీడల పట్ల యువత ఆసక్తి చూపేలా.. వారిలోని ప్రతిభను వెలికితీయడానికి దోహదపడే మైదానాలు ఎడారిని తలపిస్తున్నాయి.

- మండలంలోని వివిధ పంచాయతీల పరిధిలో ఐదేళ్ల క్రితం వీటిని ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ పంచాయతీలకు అప్పగించారు. పంచాయతీల పాలకవర్గం పదవీకాలం ముగిసి ఏడాదిన్నర కావస్తోంది. దీంతో క్రీడా ప్రాంగణాలను పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, నీటి సరఫరా పనులను పర్యవేక్షించడమే పంచాయతీ సిబ్బందికి పెద్ద భారంగా మారింది. ఈ తరుణంలో మైదానాలను పట్టించుకునే నాథుడు లేరు.

గ్రామాలకు దూరంగా...

గ్రామాల్లో ఏర్పాటు చేసిన మైదానాలు ఊరికి దూరంగా ఉన్నాయి. గ్రామ సమీపంలో అనువైన చోట ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో అందుబాటులో ఉన్న సర్కారు భూముల్లో వీటిని ఏర్పాటు చేశారు. అవి దూరంగా ఉండటంతో అంత దూరం వెళ్లి ఆటలు ఆడుకోవడానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడంలేదు. పెద్దషాపూర్‌, చొదరిగూడ కవ్వగూడ, నర్కూడ ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి.



సుల్తాన్‌పల్లిలో కూలిన క్రీడా మైదానం ప్రధాన ద్వారం బోర్డు



సుల్తాన్‌పల్లిలో క్రీడా మైదానం దుస్థితి

బోర్డులు ధ్వంసం...

- మైదానాల ప్రవేశ ద్వారం వద్ద పేర్లను సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే చాలా చోట్ల ఆయా బోర్డులు కూలి కింద పడ్డాయి.
- మైదానాల్లోని క్రీడా సామగ్రి తప్పు పట్టిపోతోంది. వీటి నిర్వహణ సరిగా లేకపోవడంతో కొన్ని చోట్ల రక్షణ కూడా కరువైంది. వర్షానికి తడిసి ఇనుప పైపులు తుప్పుపట్టి పోతున్నాయి.
- నిర్ణీత సమయంలో వీటికి రంగులు వేస్తే రక్షణగా ఉంటుంది. మైదానాల్లో వీటిని బిగించిన తర్వాత ఇప్పటి వరకు రంగులు వేసిన దాఖలాలు లేవు.



మల్కారంలో తప్పుపట్టి పోతున్న క్రీడా సామగ్రి

పిచ్చిమొక్కలతో నిండిన వైనం...

క్రీడా మైదానాలు ఎక్కడ చూసినా పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. మైదానంలోకి అడుగు పెట్టడానికి జనం భయపడుతున్నారు. వేసవి కాలం కావడంతో ఎండలకు మొక్కలు ఎండిపోయినా.. వర్షం కురిస్తే మళ్లీ ఏపుగా పెరుగుతున్నాయి. మొక్కల తొలగింపు కోసం ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. అంతేకాకుండా మైదానం చదునుగా లేకపోవడంతో ఆటలు ఆడేందుకు ఇబ్బందిగా మారి ఎవరూ అటు వైపు రావడంలేదు.

నల్ల రిబ్బన్లు ధరించి ముస్లింల ప్రార్థనలు



శాస్త్రీపురం జుమ్మా మసీదు వద్ద నల్ల రిబ్బన్లను అందజేస్తున్న ఎంపీ అసదుద్దీన్‌ ఒవైసీ



హసన్‌నగర్‌లో నల్ల రిబ్బన్‌లతో ముస్లింలు

శాస్త్రిపురం: జమ్ము కశీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం ముస్లింలు నల్ల రిబ్బన్లను ధరించి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. సులేమాన్‌నగర్‌, శాస్త్రీపురం డివిజన్‌ల పరిధిలోని అన్ని మసీదులలో ముస్లింలు నల్ల రిబ్బన్‌లు ధరించి కనిపించారు. శాస్త్రీపురం డివిజన్‌లోని జుమ్మామసీదు వద్ద ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్‌ ఎంపీ అసదుద్దీన్‌ ఒవైసీ ప్రార్థనలకు వచ్చిన ముస్లింలకు నల్లటి రిబ్బన్‌లు అందజేశారు. ప్రతి ఒక్కరూ నల్ల రిబ్బన్‌లు ధరించి ప్రార్థనలలో పాల్గొన్నాలని ఆయన సూచించారు. హసన్‌నగర్‌లోని నురానీ మసీదు వద్ద స్థానిక ఎంఐఎం నాయకుడు మహ్మద్‌ జాహంగీర్‌ ముస్లింలకు నల్ల రిబ్బన్‌లను పంపిణీ చేశారు.

రాజేంద్రనగర్‌లో...

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ జన చైతన్య వెంచర్‌లోని గడబేగ్‌ మసీదు వద్ద ముస్లింలు శుక్రవారం ప్రార్థనల అనంతరం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కశ్మీర్‌లో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ముస్లింలంతా నల్ల రిబ్బన్లను ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు సర్ఫరాజ్‌ సిద్ధిఖీ, సయ్యద్‌, హుదాయతుల్లా, షఫీ తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్‌లో నిరసన తెలుపుతున్న ముస్లింలు

పందెన్‌వాగుపై కప్పు నిర్మించండి

మణికొండ: తమ విల్లాల పక్క నుంచి వెళ్తున్న పందెన్‌వాగు ఓపెన్‌గా ఉండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని, దానిపై కప్పు నిర్మించి వాసన రాకుండా చేయాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను ట్రైల్స్‌ విల్లాల వాసులు కోరారు. మాజీ కౌన్సిలర్‌ కె.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వారు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి వారి సమస్యను వివరించారు. ఈ మేరకు ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ ఫోన్‌లో మణికొండ మున్సిపల్‌ కమిషనర్‌ డి.ప్రదీప్‌కుమార్‌తో మాట్లాడారు. పందెన్‌వాగు పై కప్పు నిర్మించేందుకు నివేదిక రూపొందించాలని ఆదేశించారు. కార్యకర్మంలో స్థానిక నేత శ్రావణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ట్రైల్స్‌ విల్లావాసులు

అలకాపూర్‌ ఎన్నికలు ఏకగ్రీవం!

మణికొండ: అలకాపూర్‌ టౌన్‌షిప్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌కు ఎన్నికలు జరగవని, 21 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రధాన ఎన్నికల అధికారి, ఆల్‌ కాలనీస్‌ ఫెడరేషన్‌ ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు. గురువారం 22 మంది నామినేషన్లు వేయటంతో ఒకరు అధికంగా ఉన్నారన్నారు. అయితే అతను శుక్రవారం తన నామినేషన్‌ను విరమించుకున్నారని ఆంజనేయులు వివరించారు. దాంతో 21 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లేనని ఆయన పేర్కొన్నారు. శనివారం కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం, అనంతరం పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకునే కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్నికల అధికారులు రాజశేఖర్‌, కాంతారావు పాల్గొన్నారు.

ఏఐతో కచ్చితమైన నిర్ధారణ లభిస్తుంది

రాయదుర్గం: వైద్యరంగంలో ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌ నిర్ధారణ పద్ధతులు అత్యంత కచ్చితత్వాన్ని అందిస్తాయని స్మైలైన్‌ డెంటల్‌ ఆస్పత్రుల చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ రామకృష్ణ వెల్లడించారు. గచ్చిబౌలి డివిజన్‌ నానక్‌రాంగూడలో స్మైలైన్‌ డెంటల్‌ ఆస్పత్రి మూడవ బ్రాంచ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీఈఆర్‌ఈసీ సిస్టమ్‌ ద్వారా అదే రోజు క్రౌన్‌లను ఏర్పాటు చేయవచ్చన్నారు. లేజర్‌ డెంటిస్ట్రీ తక్కువ నొప్పితో స్వల్ప శస్త్రచికిత్సకు మార్గం సుగమం చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్మైలైన్‌ డెంటల్‌ ఆస్పత్రి వ్యవస్థాపకులు డాక్టర్‌ సునీత, వైద్యులు కీర్తి, ప్రీతి, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై పెల్లుబికిన నిరసనలు



కొవ్వొత్తుల ర్యాలీలో సగర సంఘం నాయకులు



నల్లగండ్లలోని అపర్ణ గ్రాండేలో కొవ్వొత్తుల ర్యాలీ

శంషాబాద్‌: పెహల్గావ్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ శంషాబాద్‌ పట్టణంలో ముస్లిం సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో మినీ స్టేడియం నుంచి అంబేడ్కర్‌ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. వందల సంఖ్యలో పాల్గొన్న ముస్లింలు ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదం నశించాలని నినదించారు. ముష్కరులను తుదముట్టించాలని డిమాండ్‌ చేశారు. అనంతరం అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతులకు సంతాపం వ్యక్తం చేశారు.

చందానగర్‌: జమ్ముకశ్మీర్‌లోని పహల్గావ్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం నల్లగండ్ల అపర్ణ గ్రాండే సముదాయంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కమ్యూనిటీ వాసులు భారీగా తరలివచ్చి నినాదాలు చేశారు. ఈ నిరసనలో మహిళలు, సీనియర్‌ సిటిజన్లు ర్యాలీ నిర్వహించారు.

అంజయ్యనగర్‌లో...

గచ్చిబౌలి: ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్న వారిని దేశం నుంచి తరిమివేయాలని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పర శేఖర్‌ సగర పిలుపునిచ్చారు. పహల్గాంలో ఉగ్రవాదుల చర్యను ఖండిస్తూ అంజయ్యనగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ ప్రజలు సమైక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో సగర సంఘం గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షుడు మోడల రవి సగర, ఉపాధ్యక్షులు ఆంజనేయులు సగర, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకట్‌, గ్రేటర్‌ యువజన విభాగం అధ్యక్షులు ఎర్రంశెట్టి సీతారాం, నాయకులు గడ్డపార రవీందర్‌, రవికుమార్‌, చంద్రకళ, రాధ, మన్యంకొండ సగర తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సంఘాల జేఏసీ

ముగిసిన కేవీఎస్‌ హ్యాండ్‌బాల్‌ టోర్నీ



హ్యాండ్‌బాల్‌ బాలికల అండర్‌-17 జట్టు

రాయదుర్గం: కేంద్రీయ విద్యాలయ సమితి రీజనల్‌ స్థాయి హ్యాండ్‌బాల్‌ టోర్నమెంట్‌ ముగిసింది. కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ప్రిన్సిపాల్‌ జితేంద్రకుమార్‌ అండర్‌-17 బాలికల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రీయ విద్యాలయలో చదువుతోపాటు క్రీడలు, సేవా రంగాలలో విద్యార్థులు రాణించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. పోటీలలో విజేతగా కేంద్రీయ విద్యాలయ గోల్కొండ జట్టు, రన్నరప్‌గా కేంద్రీయ విద్యాలయ పికెట్‌ జట్టు, మూడవ స్థానాన్ని కేంద్రీయ విద్యాలయ తిరుమలగిరి నిలిచింది. మొదటి మూడు స్థానాలలో నిలిచిన జట్లకు మెడల్స్‌, సర్టిఫికెట్లను ప్రిన్సిపల్‌ జితేంద్రకుమార్‌ అందించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కోచ్‌, ఫిజికల్‌ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దోమతెరలు వాడాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు

చందానగర్‌: దోమ కాటు వలన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడు వాపు వ్యాధులు వస్తాయని, ఇంటి పరిసరాలలో నీరు నిల్వకుండా చూడాలని రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మలేరియా వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం శేరిలింగంపల్లిలోని యూపీహెచ్‌సీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్‌ వెంకటేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలతో పాటు అవి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ అధికారులకు సూచించారు. ప్రజలు దోమ తెరలు వాడాలన్నారు. జ్వరం వచ్చిన రోగులు తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం మలేరియాపై అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గుల్‌మొహర్‌ పార్కు, లింగంపల్లి రైల్వేస్టేషన్‌ వరకు నిర్వహించారు. వాల్‌ పోస్టర్లు, స్టిక్కర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రాకేష్‌, మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ ఉమదీపిక, కమ్యూనిటీ హెల్త్‌ ఆఫీసర్‌ స్వామి, ప్రేమ్‌కుమార్‌, ఏఎస్‌ఎంలు, ఆశ వర్కర్లు, జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది, ఎస్‌ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మణికొండ: కొత్త సర్వీసుల విడుదల, మెయింటెనెన్స్‌ పనులను చేపడుతున్నందున శనివారం పలు ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరాను నిలిపివేయనున్నట్లు మణికొండ, నార్సింగి ఏఈలు సంతోష్‌కుమార్‌, మణికంఠ తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్‌ టౌన్‌షిప్‌ రోడ్డు నెంబర్‌ 13, కూలీ కుదుబ్‌షా కాలనీ, పెంటయ్య కాలనీ, స్కైలా అపార్ట్‌మెంట్స్‌, వినాయకనగర్‌ ఫేజ్‌-2లలో ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్‌ ఉండదన్నారు. శ్రీరాంనగర్‌ కాలనీ, సెక్రటేరియట్‌ కాలనీలలో సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు, లాలమ్మ గార్డన్‌, బతుకమ్మ పార్క్‌, సెక్రటేరియట్‌ కాలనీ, భాగ్యలక్ష్మి కాలనీ, హుడా కాలనీ, ఫ్రెండ్స్‌ కాలనీ, తులిప్‌ గార్డన్‌ కాలనీలలో మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు, పంచవటి కాలనీలో సాయంత్రం 4. 30 నుంచి 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. తుల్జారాం దేవాలయం వెనకవైపు, అలకాపూర్‌ టౌన్‌షిప్‌ రోడ్డు నెంబర్‌ 16, 23, 25నుంచి 30 వరకు, సాయంత్రం 5 ఉంచి 5.30 గంటల వరకు, అలకాపూర్‌టౌన్‌షిప్‌ రోడ్డు నెంబర్‌ 3 నుంచి 13 వరకు, పుప్పాలగూడ గ్రామం, మారుతి నగర్‌, దుర్గా నగర్‌, రాఘవేంద్ర కాలనీ, గోల్డన్‌ ఓరియన్‌, మానస అపార్ట్‌మెంట్స్‌, ఎల్‌ఐసీ కాలనీ, అలకాపూర్‌ టౌన్‌షిప్‌ రోడు నెంబర్‌ 8 ప్రాంతాలలో సాయంత్రం 3.30 గంటల నుంచి 4 గంటల వరకు, హనుమాన్‌ నగర్‌, ఎంప్లాయీస్‌ కాలనీ, శ్రీహోంమ్స్‌ ప్రాంతాలలో ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు, శంకర కంటి ఆస్పత్రి, జయభేరి టవర్స్‌, లామ్సన్‌ టవర్స్‌ ప్రాంతాలలో సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్‌ ఉండదని మణికొండ ఏఈ తెలిపారు.

నార్సింగి ఏఈ పరిధిలో...

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట్‌, శ్రీనగర్‌, గ్రేహౌండ్స్‌ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు, కోకాపేట 250 గజాల కాలనీ, గోల్డన్‌ మైల్‌, బాబుఖాన్‌ విల్లాస్‌, గ్రాండ్‌ ఇన్ఫ్రా టెక్‌ విల్లాస్‌, దంతు స్వీట్‌ హౌస్‌ ప్రాంతంలో ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు, గిరిగిరి గడ్డ, నార్సింగి గ్రామం, ముప్పా విల్లాస్‌, ముప్పా అలేఖ్య, మంచిరేవుల, మంత్రి విల్లాస్‌, గ్రీన్‌లాండ్స్‌, జైహింద్‌ కాలనీలలో సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు విద్యుత్‌ ఉండదని నార్సింగి ఏఈ వివరించారు.

అమ్మకాలు అంతంతే .. ఆర్థికపుష్టి ఎలా..?

సందర్శకులు, కొనుగోలుదారులు వచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలంటున్న మహిళా సంఘాలు

ఇదీ ఇందిరా మహిళాశక్తి బజార్‌ పరిస్థితి..!



మాదాపూర్‌లోని ఇందిరా మహిళాశక్తి బజార్‌ ప్రధాన ద్వారం









స్టాల్స్‌లో ఆకట్టుకుంటున్న ఉత్పత్తులు

మాదాపూర్‌: ఇందిరా మహిళాశక్తి బజార్‌లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాకుండానే మహిళలకు స్టాల్స్‌ను కేటాయించారు. దీంతో అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇప్పుడిప్పుడే సందర్శకులను ఆకర్షించేందుకు గోడలపై పెయింటింగ్స్‌, వాటర్‌ ఫౌంటేన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇంకా పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుబాటులోకి రాకపోవడంతో అమ్మకాలు మందగించాయి. ఐటీ నడిబొడ్డున ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి బజార్‌లో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో స్టాల్స్‌ నిర్వహిస్తున్నారు. కానీ అమ్మకాలు మాత్రం ఆశించిన మేర జరగడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టాల్స్‌లో అగరబత్తీలు, ఉలెన్‌ ఉత్పత్తులు, చీరలు, జ్యూట్‌బ్యాగ్స్‌, ఇత్తడి, చెక్క వస్తువులు అందుబాటులో ఉంచారు. అలాగే చిరుధాన్యాలు, పిండి వంటలు, సాంప్రదాయ దుస్తులు సందర్శకులకు అందుబాటులో ఉంచారు. కేవలం శని, ఆది వారాలలో మాత్రమే అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల అమ్మకాలు పెరగాలంటే ప్రచారంతో బాటు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు.